కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమం ద్వారా వుద్దేశించిన నవీన దృక్పథమును వ్యాప్తిచేయుటలో గ్రామనాయకుల పాత్ర చాలా ప్రధానమైనది. ఈ ఉద్దేశ్యంతోనే, గ్రామనాయకుల శిక్షణ పథకమొకటి మంజూరు చేయబడింది. గ్రామనాయకుల శిక్షణ వ్యవహారాల డైరెక్టరు నియామకం జరిగింది. ఈపథకం నిర్వహణలో ప్రజలు ఉత్సాహంతో పాల్గొని, కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమం త్వరితగతిలో పురోగమించటానికి సహకరిస్తారని ఆశిస్తున్నాను.

స్థానిక అభివృద్ధి కార్యక్రమాలు :

స్థానిక అభివృద్ధి కార్యక్రమ పథకాలక్రింద 1955-56లో మనం ప్రశంసనీయమైన కృషిచేశాం. కేంద్ర ప్రభుత్వంనుండి లభించిన రూ 66.0 లక్షలు గ్రాంటుకుగాను రూ 58.33 లక్షలు నికరంగా ఖర్చు చేయబడింది. ఈ కార్యక్రమాలకు కేటాయించిన మొత్తంలో, మనకు లభించిన గ్రాంటు 88.4%. 1954-55లో, గ్రాంటు 11.1 లక్షలు లేక కేటాయింపుతో 32.7., 1953-54లో, రూ73,900లు లేక 5.1%, చైతన్యవ్యాప్తికి పూర్వదశగా, ద్వితీయ పంచవర్ష ప్రణాళిక ఆసాంతానికి రాష్ట్రమంతటా పరివ్యాప్తం కాబోతున్న జాతీయ విస్తరణ సేవా మహోద్యమానికి ప్రజానీకాన్ని సమాయత్తపరచే విధంగా యీస్థానిక అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించబడుతున్నవి. ఈ కార్యక్రమం ద్వితీయ ప్రణాళిక కాలంలోకూడా కొనసాగుతుంది. స్థానిక అభివృద్ధి కార్యక్రమాల విషయంలో అనుసరించవలసిన ప్రభుత్వ విధానం వివరాలు నిర్ణయించబడేలోగా, 1956 మార్చి 31 వ తేదీనాటికి జరుగుతున్న కార్యక్రమాలను పూర్తి చేయటానికై, యింతకు పూర్వమే మన రాష్ట్రానికి లభించిన కేంద్ర ప్రభుత్వ గ్రాంటులోనుండి రూ 28.35 లక్షలు కేటాయించబడింది.

సేద్యపు నీటి పారుదల :

వంశధార ప్రాజెక్టు.—అనేక సంవత్సరాలుగా శ్రీకాకుళం జిల్లా ప్రజానీకం వంశధార నదీ జలాలను వినియోగించుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నారు. 1956 జులై 7వ తేదీన మన ఉపముఖ్యమంత్రి ఒరిస్సా ముఖ్యమంత్రితోను, నిర్మాణాల వుపమంత్రితోనూ భువనేశ్వరంలో జరిపిన సంప్రదింపుల ఫలితంగా, గొట్ట వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి అంగీకారం కుదిరింది. గంగుడు ప్రాజెక్టు (సునినాయ్) నిర్మాణానికీ, గుణుపూరు సమీపానగల గోడికోలువద్ద రెగ్యులేటర్ వంతెన నిర్మాణానికిగల అవకాశాలను పరిశీలించటానికి వుభయ ప్రభుత్వాలు అంగీకరించినవి. ఈ నిర్మాణాలు జరిగినవెంటనే, శ్రీకాకుళం జిల్లా అలక్ష్యం చేయబడుతున్నదనే ఆరోపణలు చాలావరకు తగ్గిపోతవి.

తుంగభద్ర ఎగువ కాల్వ.— ఎగువకాల్వ సమస్యలను పరిష్కరించటానికై 1956 జూన్ 18వ తేదీన, ప్రణాళికా సంఘంవారు బెంగుళూరులో ఆంధ్ర, మైసూరు ప్రభుత్వాల ప్రతినిధుల సమావేశం ఏర్పాటుచేశారు. తుంగభద్ర ఎగువకాల్వ నీటిని ఆంధ్ర, మైసూరు రాష్ట్రాలు 65 35 నిష్పత్తిలో పంచుకోవాలని, యీ సమావేశంలో అంగీకారం కుదిరింది మొదట్లో లెక్కలోకి తీసుకోకుండా వుంచిన పల్లపు ప్రాంతాలలోని నదీ జలాలుకూడా [illegible] [illegible] [illegible] ఎల్ల ఈ జిల్లాలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ విధంగా, తుంగభద్ర ప్రాజెక్టు ప్రయోజనాలు రాయలసీమలో అధికసంఖ్యాక ప్రాంతాలకు లభిస్తున్నవి ఇప్పుడు మైసూరు ప్రభుత్వంతో ఒడంబడిక కుదిరింది కనుక, తుంగభద్ర ఎగువకాల్వ పథకాన్ని ప్రారంభించటానికి అవసరమైన చర్యలను మన ప్రభుత్వం తీసుకొంటున్నది. ఈ సంవత్సరంలో జరిగే ఖర్చుకుగాను, యీ పథకానికి రూ 28 లక్షలు, పంశధార ప్రాజెక్టుకు రూ 10 లక్షలు అప్పుగా యిచ్చి, సహకరించవలసిందని ప్రణాళికా సంఘాన్ని మన ప్రభుత్వం కోరింది.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు — ఇది ఆంధ్ర, హైదరాబాదు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు, దీని నిర్మాణానికి అయ్యే ఖర్చు అంచనా రూ 122 కోట్లు. ఈప్రాజెక్టు క్రింద గుంటూరు, నెల్లూరు, కృష్ణా జిల్లాలలో 31.83 లక్షల యకరాల భూమి సేద్యపు సాగు క్రిందికి వస్తుంది. దీనిక్రింద 75,000 కి వా. విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది. ఈ ఉభయ ప్రభుత్వాల ప్రతినిధులతోనూ, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతోనూ, ఇండియా ప్రభుత్వం నియమించిన బోర్డువారి ఆధ్వర్యంలో, ఆనకట్ట నిర్మాణం వగైరా ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహింపబడుతున్నవి. ఉభయరాష్ట్రాలలోని కాల్వల నిర్మాణ కార్యక్రమం, ఆయా ప్రభుత్వాల ఆధీనంలోవుంది ఈ ప్రాజెక్టు క్రింద యీ సంవత్సరం జరిగే ఖర్చుకుగాను కేంద్ర ప్రభుత్వంనుండి రూ. 180 లక్షలు ఋణంగా లభించింది. 1955 డిశంబరు 10వ తేదీన భారత ప్రధానమంత్రి యీ ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేశారు. బ్రహ్మాండమైన ఈ ప్రాజెక్టు నిర్మాణ కృషి త్వరితగతిలో పురోగమిస్తున్నది. ఆంధ్ర రాష్ట్రంవైపు ఆనకట్ట నిర్మాణం పూర్తి అయింది. ఇది మన జాతికే గర్వకారణమైన ప్రాజెక్టు అని చెప్పవచ్చు.

ఇతర నీటిపారుదల పథకాలు.— (పెద్దవీ, మధ్యతరహా ప్రాజెక్టులు)ఇనుము. ఉక్కు, సిమెంటు సప్లై సరిగాలేనందున, కృష్ణాబేరేజి, రాళ్ళపాడు ప్రాజెక్టు, కర్నూలు-

కడప కాల్వ వగైరా పథకాల క్రింద పనులు చురుగ్గా సాగటంలేదు. మే నెలలో కురిసిన అకాల వర్షాలమూలంగా, కొన్ని ప్రాజెక్టులలో పనులకు విఘాతం కలిగింది.

విద్యుచ్ఛక్తి :

మాచ్ ఖండ్ ప్రాజెక్టు.— 1955 ఆగస్టు 19వ తేదీన మాచ్ ఖండ్ విద్యుచ్ఛక్తిని ఆంధ్ర విద్యుచ్ఛక్తి సరఫరా విధానంతో కలుపుతూ, రాష్ట్రపతి ప్రారంభోత్సవం చేశారు. అప్పటినుంచి ప్రథమ విద్యుదుత్పాదక యంత్రం పని ప్రారంభించింది. రెండవ యంత్రం 1955 డిశంబరు 12వ తేదీన, మూడవది 1955 జూలై 22వ తేదీన విద్యుచ్ఛక్తి సరఫరా ప్రారంభించినవి. ఈ రెండూ వాణిజ్యప్రయోజనాలకు వినియోగించబడుతున్నవి. నాల్గవ, ఐదవ యంత్రాలకు కూడా ఆర్డరు యివ్వబడింది. విట్టచివరి ఆరవ యంత్రానికి కూడా మన ప్రభుత్వం ఖర్చు అంచనాలను మంజూరు చేసింది.

కొండలోయల్లో పోడుసాగు జరుగుతున్నందున, మాచ్ ఖండ్ నదీ జలాలలో బురద ఎక్కువగా వస్తున్నది. రిజర్వాయర్లలో బురద పేరుకోకుండా నివారించటానికై రాక్ ఫిల్ ఆనకట్ట, మళ్ళింపు కాల్వలు, రాతి గట్లు వగైరా యింజనీరింగ్ నిర్మాణాల రూపంలో భూస్థితి మార్పు చర్యలు తలపెట్టబడినవి. ఇంకా పెద్ద ఎత్తున, భూసార పరిశీలన కార్యక్రమాలను మాచ్ ఖండ్ ప్రాంతంలో నిర్వహించే విషయం పరిశీలనలోవుంది. తుంగభద్ర జల విద్యుత్పథకం క్రింద నిర్మాణం చురుగ్గా సాగుతున్నది. బహుశా యీ సంవత్సరం డిశంబరులో విద్యుత్ సరఫరా ప్రారంభమవుతుందని ఆశిస్తున్నాం. సీలేరు జల విద్యుత్పథకం క్రింద, సర్వే కార్యక్రమం, యితర పరిశీలనలకు ఏర్పాట్లు జరుగుతున్నవి. రేణిగుంటలో ఒక పెద్ద డీసెల్ కేంద్రం స్థాపించబడింది. ప్రైవేటు సంస్థల యాజమాన్యాన నిర్వహింప బడుతున్న విద్యుచ్ఛక్తి కంపెనీలను స్వాధీనంచేసుకునే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఆమోదించింది. దీనిక్రింద యింకా ప్రభుత్వస్వాధీనం కావలసిన కంపెనీలు ఎనిమిది మాత్రమే మిగిలివున్నవి.

రోడ్లు :

దోర్నాలనుండి శ్రీశైలం వరకు అతి ప్రధానమైన యాత్రికుల రోడ్డు నిర్మాణం ప్రారంభింపబడి, "జీపులు" పోయేందుకు వీలుగా నిర్మించబడింది. గత సంవత్సరం శివరాత్రి ఉత్సవాల సమయంలో యీ రోడ్డు మీదుగా యాత్రికులు ప్రయాణం చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి మొత్తం రూ 19.99 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా; 1957 సంవత్సరం మార్చి నాటికి యీ నిర్మాణం పూర్తి కావలసివుంది.

ఇండియా ప్రభుత్వం యిటీవల యీ క్రింది నిర్మాణాలను ఆమోదించింది.
కేంద్ర రోడ్డునిధి సహాయంతో నిర్వహించవలసినవి :

నంద్యాలనుండి నందికొట్కూరు వరకు రోడ్డువేసి, మెటల్ చేయుట దాని మీద వంతెనలు, తూములు నిర్మించుట (రూ. 9.00 లక్షలు).

ప్రత్యేక గ్రాంట్ల పథకం క్రింద నిర్మాణాలు :

1. కర్నూలు-గుంటూరు రోడ్డు అభివృద్ధి. (మొత్తం రూ. 26 లక్షలకు గాను. రూ. 16.48 లక్షలు).

2. మారేడుమిల్లినుండి చింతూరుకు రోడ్డు వేయుట (రూ. 10 లక్షలు).

3. చింతూరునుండి కూనవరానికి రోడ్డు వేయుట (రూ. 3.53 లక్షలు).

జిల్లా బోర్డుల అధీనంలోగల రోడ్లను సక్రమంగా నిర్వహించటానికై. రాష్ట్రంలోని జిల్లా బోర్డులకు తగినంత ఆర్థిక సౌష్టవంలేనందున, 1956-57 బడ్జెటులో రాష్ట్రంలోని రోడ్ల నిర్వహణ నిమిత్తం కేటాయించిన మొత్తంలో. 10% జిల్లా బోర్డు రోడ్ల నిర్వహణకు ప్రత్యేకించాలని ప్రభుత్వం వుత్తరువు జారీ చేసింది.

జాతీయ రహదార్లు :

తూర్పు గోదావరి జిల్లా ఆలమూరువద్ద గోదావరినదీపాయ గౌతమికి రూ 1,24,79,000 ల ఖర్చుతో వంతెన నిర్మాణాన్ని (నెం 5 రు జాతీయ రహదారి) కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వంతెన నిర్మాణ కార్యక్రమం కొనసాగుతున్నది. నెల్లూరు జిల్లాలో గూడూరువద్ద మద్రాసు-కలకత్తా రోడ్డును (నెం 5 రు జాతీయరహదారి) కొంచెం ప్రక్కకు మళ్ళించి, ఉప్పుటేరు మీద రు 14,52,000 ల ఖర్చుతో వంతెన నిర్మించటానికై కేంద్రప్రభుత్వ సాంకేతిక ఆమోదం, ఆర్థిక సహాయ అంగీకారం లభించినవి.

కర్నూలువద్ద తుంగభద్రానదిమీద వంతెన నిర్మాణాన్నికూడా కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ పనిని కంట్రాక్టుకు యిచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వంతో వుత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నవి.

వ్యవసాయోత్పత్తి :

ఇండియా ప్రభుత్వ సహకార, సహాయాలతో, యిదివరకులాగానే. వ్యవసాయోత్పత్తులను అభివృద్ధిచేసే వివిధపథకాలను మన ప్రభుత్వం నిర్వహిస్తున్నది.

వ్యవసాయ యాంత్రిక పరికరాల సప్లయి, రసాయనిక ఎరువుల పంపిణీ, వగైరా పధకాలను కొనసాగించటమేకాక, ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో వివిధ జిల్లాలలోనూ, వ్యవసాయదారులకు మేలురకం విత్తనాలను ఎక్కువగా అందించే వుద్దేశంతో, అనేకంగా వ్యవసాయ బీజక్షేత్రాలను స్థాపించే సంకల్పంకూడావుంది.

ద్వితీయ పంచవర్ష ప్రణాళికలోని వ్యవసాయోత్పత్తి లక్ష్యాలను 15% నుండి 40% వరకు పెంచే విషయమై ప్రణాళికా సంఘంవారు శ్రద్ధగా పరిశీలిస్తున్న విషయం గౌరవనీయసభ్యులకు తెలుసుగదా. ఈ లక్ష్య సాధనకై నిర్ణయింపబడే వివిధ కార్యక్రమాల్లోనూ మన రాష్ట్రంకూడా పూర్తిగా పాల్గొంటుంది.

సహకారోద్యమం :

సమీకృత గ్రామీణ పరపతి, పైలట్ పధకం· అఖిల భారత గ్రామీణ పరపతి సర్వేసంఘంవారు సిఫార్సు చేసిన సమీకృత గ్రామీణ పరపతి సౌకర్యాల పధకాన్ని యీ సంవత్సర ప్రారంభంలో అమలు పరచటం, రాష్ట్ర సహకారోద్యమరంగంలో ప్రధానమైన విజయమని చెప్పవచ్చు. కర్నూలు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలలో ప్రత్యేకంగా ఎన్నిక చేయబడిన మూడు ప్రదేశాలలో యిదొక పైలట్ పథకంగా అమలు పరచటానికి ఆమోదించబడింది. ఈ పదకం క్రింద కొన్ని పనులకు ఖర్చు చేసేందుకై, దీర్ఘకాలిక ఋణాలుగా, కేంద్ర ప్రభుత్వం రూ 10,73,750 లు, రిజర్వు బ్యాంకు రూ. 16,66,6661 లు మంజూరు చేసినవి.

కార్మిక సమస్యలు :

సబ్సిడీ పొందిన పారిశ్రామిక గృహనిర్మాణ పధకాలు · ఇండియా ప్రభుత్వపు (సబ్సిడీ పొందిన) పారిశ్రామిక గృహనిర్మాణ పధకంక్రింద పారిశ్రామికులకు నివాస గృహాలు నిర్మించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూనుకున్నది. విజయవాడ నగరంలోనూ, దానికి చుట్టుప్రక్కలా, పారిశ్రామికుల కొరకు ఒకే అంతస్తు, ఒకే గదిగల 300 నివాస గృహాలను నిర్మించే కార్యక్రమం కొనసాగుతున్నది. దీనికై రూ 6,56,280 లు ఖర్చు మంజూరు చేయబడింది.

ఉద్యోగుల ఇన్స్యూరెన్సు పధకం-1955 అక్టోబరునుండి మన రాష్ట్రంలోని 7 కేంద్రాలలో యీ ఇన్స్యూరెన్సు పథకం అమలు జరుపబడింది. ద్వితీయ

ప్రణాళికా కాలంలో యీ పథకాన్ని రాష్ట్రమంతటా అమలుపరచాలని సంకల్పం. 1956-57 లో, రాష్ట్రంలో అదనంగా యింకా 5 ప్రాంతాలకు యీ పథకాన్ని వర్తింప జేయాలనీ, 5 డిస్పెన్సరీలను ప్రారంభించాలనీ, 3 డిస్పెన్సరీలకు భవనాలు నిర్మించాలనీ ఆలోచన జరుగుతున్నది.

ఎమ్ప్లాయిమెంటు ఎక్స్ఛేంజీలు:- ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజీలను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొనే విషయం నిర్ణయమైంది. వీటి నిర్వహణకు అయ్యే ఖర్చులను కేంద్ర ప్రభుత్వమూ, రాష్ట్ర ప్రభుత్వమూ 60 : 40 నిష్పత్తిలో భరిస్తవి.

1956—57 లో యీ క్రింది రెండు క్రొత్త పథకాల నిర్వహణను మంజూరు చేయాలని ప్రభుత్వం సంకల్పిస్తున్నది. 1956—57 బడ్జెట్ అంచనాలలో యీ పథకాల ఖర్చు నిమిత్తం కేటాయింపు కూడా జరిగింది.

1. ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజీలను ఎక్కువ చేయుట:—శ్రీకాకుళం వినా యితర జిల్లాలలో ఒక్కొక్కటి చొప్పున ప్రస్తుతం మన రాష్ట్రంలో 10 ఎక్స్ఛేంజీలు పని చేస్తున్నవి. ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వ పరంకాగానే, శ్రీకాకుళంలో కూడా ఎమ్ప్లాయిమెంటు ఎక్స్ఛేంజీని ప్రారంభించాలని ప్రభుత్వం అభిప్రాయపడుతున్నది

2. ఉద్యోగవసతుల సమాచార సేకరణ పథకం:- పబ్లిక్ ప్రైవేట్ రంగాలలో వృత్తులనూ, శిక్షణనూ కల అవకాశాల వివరాలను సేకరించి, యీ సమాచారాన్ని వుద్యోగార్థులకు అందజేయటమే యీ పథకంయొక్క ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంలోనే, ఇండియా ప్రభుత్వం 1955లో ఢిల్లీలో ఒక పైలట్ పథకాన్ని అమలు జరిపింది. దాని ఫలితాలు తెలియగానే, మన రాష్ట్రంలో యీ పథకం అమలు జరుపబడుతుంది.

భారీ పరిశ్రమలు:—గడచిన సంవత్సరంలో, చిత్తూరు జిల్లా తిరుపతిలోనూ, తూర్పు గోదావరి జిల్లా కాకినాడ లోనూ, అనంతపురం జిల్లా తాడిపత్రిలోనూ, మూడు నేత మిల్లులు; గుంటూరు, కృష్ణా జిల్లాలలో రెండు పంచదార ఫ్యాక్టరీలు, కర్నూలు, కడప జిల్లాలలో రెండు సిమెంటు ఫ్యాక్టరీలు క్రొత్తగా స్థాపించటానికీ, ప్రస్తుతం రాష్ట్రంలో పనిచేస్తున్న కొన్ని సిమెంటు, పంచదార ఫ్యాక్టరీల అభివృద్ధికీ, కేంద్ర ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేసింది. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలోనూ, విశాఖపట్నంజిల్లా చోడవరంలోనూ పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు

లోనూ, అనంతపురం జిల్లా హిందూపురంలోనూ, చిత్తూరు జిల్లా చిత్తూరులోనూ, 5 సహకార పంచదార ఫ్యాక్టరీల స్థాపనకు లైసెన్సు యివ్వవలసిందని మన ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ అయిదు సహకార సంఘాలు అప్పుడే రిజిష్టరు చేయబడినవి, షేరు ధనం వసూలుచేయటానికీ, ఫ్యాక్టరీని ప్రారంభించ టానికీ అవసరమైన ఇతర ప్రాథమిక కార్యక్రమాలను నిర్వహించటానికి, వీటిలో ప్రతి సంఘానికి ఒక డిప్యూటీ రిజిస్ట్రారును నియమించటం కూడా జరిగింది.

చిన్న తరహా పరిశ్రమలు.—దేశంలోని చిన్న తరహా పరిశ్రమలను అభివృద్ధి పరచే వుద్దేశంతో, వాటికి వుదారంగా ఆర్థిక సహాయాన్ని అందించే ఒక పథకాన్ని ఇండియా ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం ప్రకారం, పారిశ్రామిక సహ కార సంఘాలకు 2½%, యితర పరిశ్రమదారులకు 3% వంటి తక్కువ వడ్డీ రేట్ల మీద చిన్న తరహా పారిశ్రామిక సంస్థలకు తిరిగి అప్పులు యిచ్చే నిమిత్తం, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఋణం మంజూరు చేస్తుంది. దరఖాస్తుదారులు పెట్టిన హామీల విలువలో 75% వరకు, పరిశ్రమదారులకు అప్పులు మంజూరు చేయబడుతవి. ఈ తక్కువ వడ్డీ రేట్లతో ఒక్కొక్క దరఖాస్తుదారునికి రూ. 50,000 ల గరిష్ట పరిమితివరకు అప్పుగా యివ్వబడుతుంది.

చిన్న తరహా పరిశ్రమల బోర్డువారి సిఫార్సుల ననుసరించి, ఇండియా ప్రభుత్వం దేశవ్యాప్తంగా, పారిశ్రామిక కేంద్రాలను నెలకొల్పటానికి నిశ్చయించింది. కేంద్ర ప్రభుత్వ సహాయంతో యిటువంటి కేంద్రమొకటి యీ సంవత్సరంలో విశాఖపట్నంలో ప్రారంభించబడుతుంది.

ఈ సంవత్సరంలో, కేంద్ర ప్రభుత్వ సహాయంతో అమలు జరిపే నిమిత్తం మొత్తం రూ 25.10 లక్షల ఖర్చుతో, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి లక్ష్యం గాగల 18 పథకాలు మంజూరు అయినవి.

కుటీర పరిశ్రమలు.—నారపీచు, బొంగులు, బుట్టల అల్లికం, అగ్గిపెట్టెలు, కొయ్య బొమ్మలు తోళ్ళపదును, తోళ్ళ అద్దకం, కలంకారీ అద్దకం, వగైరా వివిధ పరిశ్రమలకు, చెందిన పథకాలు యీ సంవత్సరం అమలు జరిపే వుద్దేశంతో మంజూరు చేయబడినవి. ఈ సంవత్సరంలో కుటీర పరిశ్రమల అభివృద్ధి కార్య క్రమం క్రింద మంజూరైన వివిధ పథకాలమీద మొత్తం ఖర్చు రూ 1,96,500 లు-

రాష్ట్రంలోని పట్టు పరిశ్రమ అభివృద్ధికై ఏజన్సి ప్రాంతాల్లో మూడు. యితర ప్రాంతల్లో ఆరు. మొత్తం తొమ్మిది పథకాలు, రూ 5,85,500 ల ఖర్చు అంచనాతో ఆమోదం నిమిత్తం కేంద్ర సిల్కు బోర్డు వారికి సమర్పించబడినవి. బోర్డువారు ఏజన్సీకాక యితర ప్రాంతాలకు చెందిన ఆరు పథకాలను ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వం తమనిధులనుంచి, మిగిలిన ఖర్చు నిమిత్తం, బడ్జెట్‌లో కేటాయింపుచేసే షరతుమీద రూ 1,11,850 ల కేంద్రసహాయాన్ని, అంటే 1956-57 ఖర్చులో సగ భాగం, అందిస్తామని తెలియజేశారు. ఈ పథకాలను యీ సంవత్సరంలోనే అమలు పరచాలని ప్రభుత్వం నిశ్చయించింది.

చేనేత పరిశ్రమ.—రాష్ట్రంలోని చేనేత పరిశ్రమాభివృద్ధి నిమిత్తం, చేనేత సెస్సు నిధిలో మన రాష్ట్రం వాటాక్రింద 1956 మార్చి 31 వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ 145.22 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తంలో నుండి 1956 మార్చి చివరకు రూ 133.63 లక్షలు ఖర్చు చేయబడింది. వర్తమాన సంవత్సరానికిగాను, రూ 137.43 లక్షలు ఖర్చు అయ్యే పథకాలను ఆమోదం నిమిత్తం అఖిల భారత ఖాదీ సంఘంవారికి పంపడమైనది. చేనేత పరిశ్రమ రంగంలోని వివిధ విషయాలకు సంబంధించిన యీ పథకాలు ముఖ్యంగా చేనేత పారిశ్రామికుల జీవిత పరిస్థితులను చక్కచేయడానికీ, పరిశ్రమను ప్రోత్సహించటానికీ వుద్దేశించబడినవి. సహకారోద్యమ రంగంలో చేనేతవస్త్రాల అమ్మకాలమీద యివ్వబడుతున్న "రిబేటు" వల్ల అమ్మకాలు ఎక్కువై, చేనేతవస్త్రోత్పత్తికి ప్రోత్సాహం లభించింది.

గనులు.—ఇటీవలనే సవరింపబడిన ఇండియా ప్రభుత్వపు పారిశ్రామిక విధాన తీర్మానం ప్రకారం, యినుము, అభ్రకం, క్రోమ్, జిప్సమ్ వగైరా లోహ పరిశ్రమలు పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగింపబడవలసి వుంటుంది. ఈ నూతన విధానంవల్ల ప్రైవేటు రంగం పూర్తిగా లోహ పరిశ్రమలోనుండి తొలగిపోవటంలేదు. ప్రైవేటు పరిశ్రమదారులు యిప్పటివరకు అభివృద్ధిపరచిన గని ప్రాంతాల లోనూ, లేక ప్రస్తుతపు లైసెన్సులు పొడిగింపబడటానికి వారికి హక్కుగల సందర్భాలలోనూ, గనులను కౌలుకు తీసుకుని పనిచేయటానికి వారికి అర్హత వుంటుంది. ఈ నూతన విధానానికి సంబంధించిన కొన్ని విషయాలమీద కేంద్ర ప్రభుత్వ వివరణకై ప్రభుత్వం ఎదురుచూస్తున్నది.

ఆంధ్ర రాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్ :

గత సమావేశంలో నేను సూచించిన విధంగా ఆంధ్రరాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్ స్థాపింపబడి, ప్రస్తుతం వ్యాపార కార్యక్రమం నిర్వహిస్తున్నది

అడవులు :

అధికార, అనధికార సభ్యులతో మన ప్రభుత్వం యీ క్రింది సంఘాలను నియమించింది:—

1. అటవీ వినియోగ సలహాసంఘం.
2. పశుగ్రాసం, పశువుల మేపకం స్థాయీ సంఘం.
3. రాష్ట్ర వన్యమృగ సలహా సంఘం.

అటవీ విషయాలలో ప్రజా సహకారాన్ని సాధించి, వారి అభిరుచిని పెంపొందించే నిమిత్తం, ఒక స్థాయీ సంఘాన్ని యేర్పాటుచేసే సమస్య మన ప్రభుత్వ ఆలోచనలోవుంది.

మత్స్య పరిశ్రమ :

మత్స్య పరిశ్రమాభివృద్ధినిగురించి మన ప్రభుత్వం శ్రద్ధగా పరిశీలిస్తున్నది. సముద్రతీరంలో గాలివాటుకిపోయే తెప్పల సహాయంతో ప్రస్తుతం రాష్ట్రంలో చేపలు పడుతున్న విధానాలకు మారుగా, యంత్ర సహాయంతో చేపలుపట్టే ఒక క్రొత్త పద్ధతి అమలుపరచబడుతున్నది. ప్రభుత్వ సబ్సిడీ ద్వారా వీలయ్యే తక్కువ ధరలకు యంత్రపు పడవలు, "నైలాన్" అనే పేరుగల అభివృద్ధికరమైన క్రొత్తరకం వలలు మత్స్య పారిశ్రామికులకు సప్లయి చేయటానికి పథకాలు మంజూరైనవి. ఈ అధునాతన పద్ధతుల ద్వారా యితోధికంగా చేపలు పట్టటానికి వీలవుతుందని అభిప్రాయం.

గిరిజన సంక్షేమం :

ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో షెడ్యూల్డు తరగతులు, షెడ్యూల్డు జాతులు, మాజీ నేరస్థజాతుల సముద్ధరణకై వుద్దేశించబడిన కేంద్ర పథకాలకుగాను రూ 89.5 లక్షలు కేటాయించబడినవి. గిరిజన ప్రజానీకానికి వసతి సౌకర్యాలు కల్పించి, వారి వస్తువులను మార్కెట్‌లో అమ్ముకునే విషయంలోనూ, వారికి అవసరమైన వివిధ వస్తువులను సప్లయిచేయుటలోనూ సహాయపడటానికై విశాఖపట్నం ప్రధాన కార్యస్థానంగా ఆంధ్రరాష్ట్ర షెడ్యూల్డు జాతుల ఆర్థిక, అభివృద్ధి కార్పొరేషన్

స్థాపించబడింది. కేంద్ర ప్రభుత్వంనుండి లభించిన రూ. 3 లక్షల గ్రాంటుతో కార్పొరేషన్‌కు రవాణా సాధనాలు కొనుగోలు చేయబడి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలలోని ప్రధాన డిపోలు, సబ్ డిపోలలో 12 గిడ్డంగులు నిర్మించబడినవి. 1956 ఏప్రిల్ 17 వ తేదీన విశాఖపట్నంలో యీ కార్పొరేషన్‌కు నేను ప్రారంభోత్సవం చేశాను. సహకారోద్యమ కార్యక్రమంద్వారా లభిస్తున్న సమీకృత గ్రామీణ పరపతి సౌకర్యాల ప్రయోజనాలను యీ కార్పొరేషన్‌కూడా పొందటానికై, ప్రస్తుతం కంపెనీల చట్టంక్రింద రిజిష్టరయిన యీ సంస్థను ఒక సహకార సంఘంగా రూపొందించే విషయం ప్రస్తుతం పరిశీలనలోవుంది.

సాంఘిక సంక్షేమం :

గత సమావేశసమయంలో నేను వుపన్యసించిననాటికీ- నేటికీ, వెనుకబడ్డ తరగతుల సముద్ధరణ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి, ప్రభుత్వ విధానంలో యేమంత పెద్దమార్పు జరగలేదు. అస్పృశ్యతా నివారణ వగైరా పథకాలకు కేంద్ర ప్రభుత్వం యిస్తున్న గ్రాంట్లకుతోడు, గృహనిర్మాణం, కొన్ని కుటీర పరిశ్రమలలో శిక్షణకేంద్రాల ప్రారంభం వగైరా సముద్ధరణ పథకాల నిమిత్తం యీ సంవత్సరంలో కేంద్రం రూ 34,00,000 లు అదనంగా మంజూరు చేసింది. ఈ పథకాలు మన రాష్ట్రంలో ద్వితీయ ప్రణాళికకాలంలో "కేంద్ర పథకాలు"గా నిర్వహింపబడులవి. మాజీ నేరస్థజాతులకు చెందిన 250 కుటుంబాల పునరావాస సౌకర్యాల నిమిత్తం, కాలనైజేషన్ పథకాల అమలుకు రూ. 5.5 లక్షలు మంజూరు చేయబడింది.

హరిజనులకు నివేశన స్థలాలు :

హరిజనులకు, మతాంతరులకు యితర అర్హజాతులకు నివేశనస్థలాల వసతి కల్పన, మన ప్రభుత్వం నిర్వహిస్తున్న సముద్ధరణ కార్యక్రమంలో ఒక ప్రధాన విషయంగా పేర్కొనవచ్చు. ప్రభుత్వ స్వాధీనంలో గల ఖాళీ స్థలాలు (అవి లభ్యం కానప్పుడు) ప్రభుత్వం సేకరించిన ప్రైవేటు భూములు, వీరికి యిండ్ల స్థలాలనిమిత్తం కేటాయింపబడుతున్నవి. హరిజనులకు యిండ్ల స్థలాలనిమిత్తం, 1956-57 బడ్జెట్ కేటాయించిన రూ 2 లక్షలు కాక అదనంగా మరొక నాలుగు లక్షలు కేటాయించటానికి ప్రభుత్వం ఆమోదించింది.

విద్య :

యూనివర్సిటీవిద్య:—ఉన్నత విద్యల విషయంలో ముఖ్యంగా రాయలసీమ జిల్లాల అవసరాలదృష్ట్యా, 1954 సెప్టెంబరులో తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర

విశ్వ విద్యాలయం స్థాపించబడింది ప్రారంభంలో అది రెసిడెన్షియల్ విశ్వ విద్యాలయంగా ఏర్పడింది. గత రెండు సంవత్సరాల్లో అక్కడ ప్రాతిపదిక శాస్త్రాలలోనూ, యితర ముఖ్యవిషయాలలోనూ ఆనర్సు కోర్సులు ప్రారంభమైనవి. ఈ విశ్వ విద్యాలయం, ఒక ఆశాజనకమైన భవిష్యత్కార్యక్రమాన్ని రూపొందించుకుంది. ఈ కార్యక్రమం, యూనివర్సిటీ గ్రాంట్ల కమీషన్‌వారి ఆమోదం పొందవలసివుంది. 1956 జూన్ 15 వ తేదీనుండి యిది అనుబంధ విశ్వ విద్యాలయంగా మార్చబడి, రాయలసీమలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల్లోనూ, నెల్లూరు జిల్లాలోనూ గల కళాశాలలు దీనికి అనుబంధించబడినవి. ఈ చర్యతో, యీ అయిదు జిల్లాలలో ఉన్నత విద్యారంగంలో ఒక నూతన శకోదయమయిందని చెప్పవచ్చు. భారతదేశంలో చాలాకాలంనుండి వృద్ధిచెందిన విశ్వ విద్యాలయాలతోపాటు, తిరుపతి విశ్వ విద్యాలయం కూడా సముచితస్థానాన్ని అలంకరిస్తుందని ఆశిస్తున్నాను.

ఉన్నత విద్య· క్రొత్తఉన్నత పాఠశాలల ప్రారంభం.—ద్వితీయ పంచవర్ష ప్రణాళిక ప్రథమ సంవత్సర కార్యక్రమంగా, 1956-57 లో, 11-14 సంవత్సరాలు, 14-17 సంవత్సరాల మధ్యవయస్సుగల విద్యార్థివర్గాలకు యితోధిక విద్యా సౌకర్యాలు కలిగించే నిమిత్తం, క్రొత్తగా 27 మాధ్యమిక, వున్నత పాఠశాలలు తెరవాలనీ, 27 వున్నత పాఠశాలలలో అదనపు తరగతులు, విభాగాలు, ప్రారంభించాలనీ, సంకల్పించబడింది. సంస్కృత విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించే వుద్దేశంతో యీ సంవత్సరం క్రొత్తగా ప్రాచ్యవిద్యా మాధ్యమిక పాఠశాలల ప్రారంభానికి అనుమతించబడింది.

3 వ ఫారం వరకు ఉచిత విద్య.—రాష్ట్రంలోని సెకండరీ పాఠశాలల్లో 3 వ ఫారం వరకు ఉచితంగా విద్యగరపే సందర్భంలో ప్రభుత్వం యీ క్రింది వుత్తరువులు జారీచేసింది

1. 1956-57 విద్యా సంవత్సరంనుండి 1 వ ఫారం విద్యార్థులవద్ద స్కూలు జీతం వసూలు చేయకూడదు.

2. 1957-58 నుండి 2వ ఫారం విద్యార్థులవద్ద, 1958-59 నుండి 3 ఫారం విద్యార్థులవద్ద జీతం వసూలు చేయకూడదు.

3. ప్రస్తుత విద్యా సంవత్సరం, 1956-57 నుండి, 1 నుండి 3 వ ఫారం వరకు చదివే విద్యార్థినులకు జీతంలేదు,

ఉపాధ్యాయుల శిక్షణ.—ట్రైనింగ్ పాఠశాలల సామర్థ్యాన్ని పెంపొందించటానికి యీ క్రింది చర్యలు తీసుకోబడుతున్నవి.

(ఎ) అన్ని ఎలిమెంటరీ గ్రేడ్ ట్రైనింగ్ పాఠశాలలను (వెనుకబడిన వర్గాల ప్రయోజనార్థం కొన్ని తప్ప) సెకండరీగ్రేడ్ ట్రైనింగు పాఠశాలలుగా మార్చుట.

(బి) శిక్షణ తరగతుల ప్రవేశానికి సామాన్య విద్యార్హతలు, పెద్దవి నిర్ణయించుట

(సి) ప్రధానంగా ఎక్కువ విద్యార్హతలు కలవారికోసం, ఒక సంవత్సరం ట్రైనింగు కోర్సు ప్రారంభించుట.

పాఠ్య గ్రంథాలు.—పాఠ్యగ్రంథాలు నిర్ణయించి, ప్రకటించటానికై చట్ట బద్ధమైన ఒక సంస్థ ఏర్పడేలోగా జిల్లాబోర్డులు, మునిసిపాల్టీల అధీనంలోగల ప్రాథమిక పాఠశాలలలో 1957-58 సంవత్సరంలో వుపయోగించటానికై పాఠ్య గ్రంథాలను నిర్ణయించటానికై ప్రస్తుతానికి ఒక అడ్ హాక్ కమిటీని నియమించ టానికి మన ప్రభుత్వం నిశ్చయించింది. ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యల వల్ల, విద్యారంగంలోని అన్ని సమస్యలు శ్రద్ధగా పరిశీలించబడుతున్నవని స్పష్ట మవుతున్నది.

సాంకేతిక విద్య :

1. పాలీటెక్నిక్ పాఠశాలలు.—ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో చేర్చబడిన వివిధ పథకాల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సిబ్బందిని సమకూర్చుకునేందుకై కాకినాడ, ఉయ్యూరులలో ప్రస్తుతం వున్న రెండు పాలిటెక్నిక్ పాఠశాలలుకాక, ప్రణాళికకాలంలో, క్రొత్తగా మరి రెండు పాలిటెక్నిక్ పాఠశాలలను ప్రారంభించాలని నిశ్చయించబడింది. ఈ రెంటిలో ఒకటి 1956-57 విద్యా సంవత్సరంలో విశాఖ పట్నంలోనూ, రెండవది కొంతకాలం తర్వాత రాయలసీమలోనూ స్థాపింపబడుతవి.

2. పశుపోషణ.—రాష్ట్రాల పునర్నిర్మాణ కార్యక్రమం దృష్ట్యా, ఆంధ్ర పశు వైద్యకళాశాలలో రెండో సంవత్సరం బి. వి. యస్. సి. కోర్సు బాపట్లలోనే కొన సాగించాలనీ, మొదటి సంవత్సరం కోర్సుకు క్రొత్తగా విద్యార్థులను చేర్చుకోవాలనీ, ఈ కళాశాల శాశ్వతంగా ఎక్కడ వుండాలనే విషయం, తరువాత నిర్ణయించు కోవచ్చుననీ, నిశ్చయింపబడింది. హనుమంతవాకలోని ప్రభుత్వ డైరీ ఫారంలోని పశువుల యిన్‌స్పెక్టర్ల కోర్సును, రెండు సంవత్సరాల యింటర్మీడియేటు ఎమర్జన్సీ వెటర్నరీకోర్సుగా పునర్నిర్మించబడింది. ఈ కోర్సు యీ సంవత్సరంకూడా కొన సాగింపబడుతున్నది.

3. కర్నూల్లో మూడో వైద్య కళాశాల.—కర్నూల్లో మూడవ వైద్యకళాశాలను స్థాపించటానికి ప్రభుత్వం నిశ్చయించి, యీ నిర్ణయాన్ని అమలు పరచటానికై చర్యలు తీసుకుంది. 1956-57 సంవత్సరంలో కర్నూలు కళాశాలలో చేరటానికి వుద్దేశించిన 50 మంది విద్యార్థులు ప్రస్తుతానికి గుంటూరు వైద్యకళాశాలలో యం. బి. బి. యస్. కోర్సులో చేరి చదువుతారు. క్రొత్త కళాశాలకు అవసరమైన సన్నాహాల నిమిత్తం రూ 3.00 లక్షలు మంజూరు చేయబడింది. ఒక ప్రత్యేకాధికారి ప్రస్తుతం కర్నూలులో కళాశాల నిర్మాణానికి సంబంధించిన వివరాలను తయారు చేస్తున్నారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులు వగైరా అభివృద్ధి :

మన రాష్ట్రంలో లభ్యమవుతున్న వైద్యసౌకర్యాలు చాలా తక్కువని చెప్పక తప్పదు. ఇతరసాంఘిక సౌకర్యాలవలె, వైద్యసౌకర్యాలను భారీయెత్తున అభివృద్ధి చేయవలెనంటే, ప్రస్తుతం మనకు గల ఆర్థిక వసతులకు అందుబాటు కొంతంత ఎక్కువగా ప్రతి సంవత్సరం ఖర్చుచేయవలసి వస్తుంది. అయినప్పటికీ మన ప్రణాళికలో రాష్ట్రంలోని వైద్యవసతులను అభివృద్ధిచేయటానికి కొంతవరకు అవకాశం కల్పించబడింది. విశాఖపట్నం కింగ్ జార్జి ఆసుపత్రి, కర్నూలు జనరల్ ఆసుపత్రి, కడప, ఏలూరు పట్టణాలలోని హెడ్ క్వార్టర్సు ఆసుపత్రులలో, అదనపు భవనాల నిర్మాణం, మంచాల సంఖ్య హెచ్చింపుదల, సిబ్బంది నియామకం వగైరా అభివృద్ధికార్యక్రమ వసతులు చేయబడినవి. అనంతపురం ఆసుపత్రిని యిప్పుడున్న చోటునుంచి మార్చి, మరొకచోట భవనాలు నిర్మించటం, ప్రస్తుతం వైద్య సదుపాయాలులేని అన్ని రివిన్యూ ఫిర్కా గ్రామాల్లోనూ డిస్పెన్సరీలు స్థాపించటం వగైరా ప్రతిపాదనలను ప్రభుత్వం శ్రద్ధగా పరిశీలిస్తున్నది. రాష్ట్రంలోని వైద్యసౌకర్యాలను పెంపొందించే లక్ష్యంతో, కొన్నికొన్ని చోట్ల, ఉదారులైన దాతలు విరాళాలిచ్చి సహకరించటానికి సిద్ధమైనారు. గుంటూరులో గవర్నమెంటు జనరల్ ఆసుపత్రిలో శిశువైద్యపు వార్డు నిర్మాణం, నెల్లూరులోని ప్రభుత్వ సంక్షేమ నిధి క్షయ ఆసుపత్రిలోనూ, గూడూరు గవర్నమెంటు ఆసుపత్రిలోనూ అదనపు భవనాల నిర్మాణం, సందర్భాలలో దాతలు యిచ్చిన విరాళాలను మన ప్రభుత్వం కృతజ్ఞతతో స్వీకరించింది. ఇటువంటి విరాళాలు యితోధికంగా వస్తాయని ఆశిస్తున్నాం.

ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో, మన రాష్ట్రంలోని జాతీయ విస్తరణ సేవాకేంద్రాలలో 55 ప్రాథమికవైద్య కేంద్రాలను నిర్వహించాలని సంకల్పం. రోగనిరోధంలోనూ, రోగనివారణలోనూ, తగినంతగా వైద్య సదుపాయాలు యింతవరకు

లభించని ప్రజానీకానికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్యాన్ని పెంపొందించ టానికై ప్రణాళికలోని వైద్య, ప్రజారోగ్య విభాగం, వుద్దేశిస్తున్నది.

ఆయుర్వేద, హోమియో వైద్య విధానాలకు ప్రోత్సాహం.—ప్రస్తుతం, ఆయుర్వేద వైద్యులు, యితర దేశీయవిధానాలను అనుసరిస్తున్న వైద్యులు, మద్రాసు లోని కేంద్ర దేశీయ వైద్య సంస్థవారిచే, ఆ సంస్థ నిబంధనావళి ననుసరించి రిజిస్టరు చేయబడుతున్నారు. ఈ సంస్థ చట్టబద్ధమైందికాదు. మన రాష్ట్రంలో ప్రకృతి వైద్యం, హోమియోపతి విధానాలకు ప్రభుత్వామోదం లేనందున, యీ విధానాలను అనుసరిస్తున్న వైద్యులను మద్రాసుసంస్థ రిజిస్టరు చేయటంలేదు.

తమను చట్టబద్ధంగా గుర్తించాలని, ఆయుర్వేదం, యితర దేశీయ వైద్య విధానాలను అనుసరిస్తున్న వైద్యులు, వైద్యసంస్థలు ఆందోళన చేస్తూవచ్చాయి ఆయుర్వేద, సిద్ధ, యునానీ, హోమియో వైద్య విధానాలను ప్రజల్లో వ్యాప్తి చేయ టానికి పథకాలను రూపొందించుటకై ప్రభుత్వం నియమించిన నిపుణుల సంఘాలు కూడా యీ గుర్తింపు సమస్యనుగురించి కొన్ని సిఫార్సులు చేసినవి ఇప్పటికే ప్రకృతి వైద్యం రాష్ట్రంలో అమలుజరుగుతున్న దృష్ట్యా, యీ సంఘాల సిఫార్సుల ననుసరించి, రాష్ట్రంలోని ఆయుర్వేద (యీ పదంలో వివిధదేశీయ విధానాలనే అర్థంతో), హోమియో వైద్యులు, ఫార్మశీలకు వర్తించేవిధంగా ఒక సాముహిక్యశాసన నిర్మాణం నిశ్చయించబడింది ఇందుకు సంబంధించిన బిల్లు యీ సమావేశంలోనే ప్రవేశ పెట్టబడుతుంది

పట్టణాల నీటి సప్లై—మురుగు పారుదల పథకం :

ప్రథమ పంచవర్ష ప్రణాళిక కాలంలో, మునిసిపాలిటీల లోనూ, పట్టణ పంచాయతీలలోనూ, క్రొత్తగా ప్రారంభించిన 8 నీటిసప్లై ప్రణాళికలు, 2 మునిసిపల్ మురుగు పథకాలుగాక, యిప్పటికీ అమలులోవున్న 9 (రక్షిత) నీటిసప్లయి పథకాల అభివృద్ధి కార్యక్రమాలుకూడా నిర్వహించబడినవి. 17 నీటిసప్లయి పథకాలలో ఒకటి ప్రథమ ప్రణాళిక కాలంలోనే పూర్తికాగా, మిగిలిన 16 పథకాలు ద్వితీయ ప్రణాళికలో కొనసాగించబడుతున్నవి.

నీటిసప్లయి పథకాలలో అతి ప్రధానమైనది విశాఖపట్నంలోని గోస్తనీ ప్రణా ళిక. దీనిఖర్చు అంచనా రూ 116 లక్షలు. విశాఖపట్నంలోని మునిసిపాలిటీ, రైల్వే, రేవు, దేశరక్షణ వ్యవస్థల వినియోగార్థం యీ ప్రణాళిక వుద్దేశించబడింది. ఈ ప్రణాళిక 1956 డిశంబరు నెలాఖరుకు పూర్తి అవుతుంది, 1957 జనవరి 1 వ తేదీనుండి కాల్టెక్స్ నూనెశుద్ధి కర్మాగారాలకు నీటిసప్లయి ప్రారంభంకావచ్చు.

మొదటి పంచవర్ష ప్రణాళికలో ప్రారంభించబడిన 3 మురుగు నీటిపారుదల పథకాలలో విశాఖపట్నం పథకం (అసంపూర్తి మురుగు పథకం), పూర్తి అయింది. విజయవాడ పథకం క్రింద పని కొనసాగుతున్నది. ఏలూరు మురుగు పథకం మంజూరు చేయబడింది. 1956–57 లో యిది ప్రారంభించబడుతుంది.

జాతీయ నీటిసప్లై, పారిశుద్ధ్య ప్రణాళిక.

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామీణ ప్రాంతాల జాతీయ నీటిసప్లయి, పారిశుద్ధ్య ప్రణాళిక, అపరిశుభ్రంకాకుండ కనీసభద్రతలు కల్పించబడిన మంచినీటి సప్లయి సౌకర్యాలను వుద్దేశిస్తున్నది. దీనితోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య అభివృద్ధికూడా యీ ప్రణాళిక లక్ష్యం. ఈ పథకం క్రింద కేంద్ర ప్రభుత్వసహాయం, మంజూరైన ప్రతిపథకం క్రింద చేయబడేఖర్చులలో సగభాగం ఒకే మొత్తం గ్రాంటు రూపంలో లభ్యమవుతుంది. మిగిలిన సగభాగం, గ్రామస్తులనుండి స్థానిక సంస్థలనుండి విరాళాల రూపంలోనూ, రాష్ట్ర నిధులనుండి, రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుకోవలసివుంటుంది. ఈ స్కీము మన రాష్ట్రంలో ప్రస్తుతం నాలుగు ప్రాంతాల్లో అమలు పరచబడుతున్నది. ఈ ప్రాంతాలు కాక, మరి నాలుగు జిల్లాలకు యీ పథకాన్ని వ్యాపింపజేసేందుకై ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో రూ 95 లక్షలు కేటాయించబడింది.

మునిసిపాలిటీల పరిపాలనా నిర్వహణ :

చట్టబద్ధంగా తమకు సంక్రమించిన విధులను, బాధ్యతలను సక్రమంగా నిర్వహించక అసామర్థ్యాన్ని వ్యక్తంచేసినందువల్లనూ, ఆర్థికాది విషయాలలో బాధ్యతారహితంగా ప్రవర్తించినందువల్లనూ, గుంటూరు, విజయవాడ మునిసిపాలిటీలు 1956 జూన్ 22 వ తేదీనుండి ఒక సంవత్సర కాలంవరకు రద్దు చేయబడినవి.

మునిసిపల్, పంచాయతీ ఎన్నికలు :

రాష్ట్రంలోని పురపాలక సంఘాలలో 32 మునిసిపాలిటీలలో 1956 జూన్ నెలలో ఎన్నికలు జరిగి, క్రొత్త కౌన్సిళ్ళు జులై 1 వ తేదీనుండి అధికారంలోకి వచ్చినవి. హైకోర్టు స్టే ఆర్డరు మూలకంగా చీరాల మునిసిపాలిటీకి ఎన్నికలు జరగటానికి అవకాశం లేక పోయింది. దానికి ఒక స్పెషల్ ఆఫీసరును నియమించవలసి వచ్చింది. విజయవాడ, గుంటూరు పురపాలక సంఘాలు రద్దుచేయబడినందున అక్కడ ఎన్నికలు జరుగలేదు.

రాష్ట్రంలో 230 ఒకటో గ్రేడు పంచాయతీలు, 6,560 రెండో గ్రేడు పంచాయతీలు వున్నవి. 1956 జులై 15 వ తేదీ వరకు 4,062 పంచాయతీలలో ఎన్నికల కార్యక్రమం పూర్తి అయింది.

జిల్లా బోర్డుల పునర్నిర్మాణం :

జిల్లా బోర్డులయింతా, స్పెషల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్న కలెక్టర్ల ఆధ్వర్యంలోనే వున్నవి స్పెషల్ ఆఫీసర్లకు సహాయంగా యిటీవలనే సలహా సంఘాలు నిర్మించబడినవి. జిల్లా బోర్డులను ఏ విధంగా పునర్నిర్మించాలనే విషయాన్ని ప్రభుత్వం శ్రద్ధగా పరిశీలిస్తున్నది

అమ్మకం పన్ను పరిశీలక సంఘం :

అమ్మకంపన్ను చట్టాన్ని, ప్రత్యేకంగా పన్ను ఎగవేతల సమస్య దృష్ట్యా పరిశీలించి, దాని నిర్వహణ విధానాలను విచారించి యీ పన్ను మూలంగా ప్రభుత్వానికి ఆదాయం అధికమయ్యే చర్యలను సూచిస్తూ నివేదిక తయారు చేయటానికై గత డిశంబరులో ప్రభుత్వం అమ్మకం పన్ను విచారణ సంఘాన్ని నియమించింది. ఈ సంవత్సరం మే నెల ఆఖరుకు యీ సంఘం వారి నివేదిక ప్రభుత్వానికి సమర్పించబడింది. నివేదిక అచ్చు ప్రతులు గౌరవనీయ సభ్యులకు అందజేయబడినవి ఈ సంఘం అధ్యక్షుడు, సభ్యులు చేసిన అమూల్యకృషి ప్రభుత్వ ప్రశంసకు పాత్రమైనదని యీ సందర్భంలో చెప్పదలచుకున్నాను.

ఇప్పుడు అమల్లోవున్న, అనేకసార్లు పన్నువిధింపు (మల్టీ పాయింట్) విధానానికి మారుగా, వేరుశెనగ, బెల్లం, ముడియినుము, వస్త్రాలు వగైరా వస్తువులకు ఒకేసారి విధింపు (సింగిల్ పాయింట్) పద్ధతిని ప్రవేశపెట్టాలనేది యీ సంఘం సిఫార్సులలో ప్రధానమైనది. పన్నుల ఎగవేతను అరికట్టటానికై సంఘంవారు కొన్ని చర్యలనుకూడా సూచించారు. ఈ సిఫార్సులను మన ప్రభుత్వం పరిశీలించింది. వీటిలోని ప్రధాన సూచనలను అమలు పరచటానికై, యీ సమావేశంలోనే ఒక శాసనం చెయ్యాలని ప్రభుత్వం సంకల్పిస్తున్నది.

భూసంస్కరణలు :

ఆంధ్ర భూసంస్కరణల సంఘం, తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ సంఘంవారి అపారమైనకృషి, అమూల్యమైన వారి నివేదిక ప్రభుత్వ ప్రశంసకు

పాత్రములైనవి. ఈ సంఘం సిఫార్సుల ననుసరించి రాబోయే శాసనాల దృష్ట్యా, కౌలుదార్లు, ప్రస్తుతం తమ స్వాధీనంలోగల భూములనుండి వెళ్ళగొట్టబడతారనే సందేహం కలుగుతున్నది. ఇటువంటి పరిస్థితులు సంభవించకుండా నిరోధించాలని మేము నిశ్చయించాం. కౌలుదార్లు అన్యాయంగా పొలాలనుండి వెళ్ళగొట్టబడకుండా నివారించి, వారికి రక్షణ కల్పించటానికై నేను 1956వ సం॥పు ఆంధ్రకౌలుదార్ల రక్షణ ఆర్డినెన్సు జారీచేశాను. ఈ ఆర్డినెన్సు స్థానంలో కౌలుదారీ విధానాన్ని యింకా శాశ్వత పద్ధతులలో సంస్కరించటానికి తగినశాసన చర్యలు తీసుకోవాలని వుద్దేశిస్తున్నాము.

అన్నిరకాల యీనాం భూములను రైత్వారీ పద్ధతిక్రిందికి మార్చటానికీ, కొన్ని రకాల యీనాం కౌలుదార్లకు స్వాధీన హక్కులు సంక్రమింప జేయటానికీ, శాసనం చేయాలనికూడా నిశ్చయింపబడింది.

మద్యనిషేధం :

మద్యనిషేధ శాసనాన్ని కట్టుదిట్టంగా అమలుపరచే వుద్దేశంతో మద్యనిషేధాన్ని అమలుపరచే కార్యక్రమాలు రాష్ట్రమంతటా 1956 జనవరి 15 వ తేదీనుండి పోలీసు శాఖకు అప్పగించబడినవి.

పోలీసులకు నివాస వసతి :

గత శాసనసభ బడ్జెట్ సమావేశంలో పోలీసు సిబ్బందికి వసతి విషయంలో చాలామంది గౌరవనీయ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపించారు. రాష్ట్రంలోని పోలీసు వుద్యోగులకు తగిన నివాస వసతి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం కూడా ఆదుర్దా పడుతున్నది. 1955 చివరకు సార్జెంట్లు, మేజర్ సార్జెంట్ల విషయంలో మంజూరైన శాశ్వత సిబ్బంది దృష్ట్యా, పోలీసు క్వార్టర్ల శాతం 55.4, సబ్-యిన్‌స్పెక్టర్లకు 40 4, హెడ్ కానిస్టేబిల్సు విషయంలో 55.6, కానిస్టేబిల్సుకు 55.9,. 1953 అక్టోబరు 1 వ తేదీనుండి పోలీసుల నివాస వసతి నిమిత్తం అనేక పథకాలు మంజూరు చేయబడినవి. వీటిక్రింద రూ 35 లక్షలు ఖర్చుచేయబడింది. ఈ సంవత్సరం బడ్జెట్‌లో ఇందునిమిత్తం రూ 14 37 లక్షలు కేటాయించబడినవి. వర్తమాన, ఆర్థిక సంవత్సరంలో యింకా యెక్కువ పథకాలను నిర్వహించటానికై, మన కేటాయింపుకు సమాన మొత్తాన్ని అప్పుగా యివ్వవలసిందని యిటీవల కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించడం కూడా జరిగింది. బడ్జెట్‌లో కేటాయించబడిన మొత్తంతోనూ, కేంద్ర ప్రభుత్వం వాగ్దానంచేసిన ఋణంతోనూ, యీ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని

వివిధ ప్రదేశాలలో 23 పోలీసు నివాస వసతి ప్రణాళికలు అమలు పరచాలని ప్రభుత్వం వుద్దేశిస్తున్నది. ఈ విధంగా సంవత్సరానికి పోలీసులకు సంతృప్తికరమైన నివాస వసతి సౌకర్యాల కల్పన కృషిలో కొంతవరకైనా అభివృద్ధి సాధింపగలుగు తామని ఆశిస్తున్నాము

గోదావరి పుష్కరం.

భారతదేశంలోని పెద్ద ఉత్సవాలలో గోదావరి పుష్కరం ఒకటి దీనికి దేశం నలుమూలలనుండి అనేకమంది యాత్రికులు వస్తారు. పుష్కరం ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చి, సుమారు 15 రోజులపాటు ఉత్సవం జరుగుతుంటుంది రెండు సిద్ధాంతాలకు చెందిన ఖగోళ శాస్త్రజ్ఞుల మధ్య, గోదావరి పుష్కర కాలాన్ని గురించి అభిప్రాయభేదాలు కలిగినందున, యీ సంవత్సరం పుష్కరోత్సవాలు 1951 మే 1 వ తేదీ నుండి జూన్ 2 వ తేదీ వరకు ఒక నెల రోజులు జరిగినవి. నిర్ణీత కాలాలు రెండింటికీ సరిపడే ఏర్పాట్లు చేయవలసివచ్చింది. ఈ ఉత్సవాల సమయంలో అవసరమైన ఏర్పాట్లను, ఖర్చులను కంట్రోలు చేయడానికై కలెక్టర్ల అధ్యక్షత క్రింద, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు రెండు సంఘాలు ఏర్పాటు చేయబడినవి. ఉత్సవానికి సంబంధించిన పారిశుద్ధ్య ఏర్పాట్లు వగైరా చేసుకొనేందుకు తూర్పు గోదావరి జిల్లా సంఘానికి రూ 75,000 లు గ్రాంటుగానూ, రూ 25,000 లు తిరిగి తీర్చవలసిన అడ్వాన్సుగానూ, పశ్చిమ గోదావరి జిల్లా సంఘానికి రూ 25,000 లు గ్రాంటుగానూ మన ప్రభుత్వం మంజూరు చేసింది.

ప్రజారోగ్యశాఖ, పోలీసుశాఖవారు చేసిన చక్కని ఏర్పాట్లవల్ల, సుమారు 10 లక్షలకు పైగా యాత్రికులు వచ్చినప్పటికీ, ఏవిధమైన అంటువ్యాధులు దుస్సంఘటనలు జరుగకుండా, యీ ఉత్సవం ప్రశాంతంగా జరిగిపోయింది.

శాసన కార్యక్రమం :

ఈ సమావేశంలో, 1925 వ సం॥పు ఆంధ్ర విశ్వవిద్యాలయ చట్టాన్ని, 1947 సం॥పు మద్రాసు దేవదాసీ (అర్పణ నిరోధం) చట్టాన్ని, 1951 వ సం॥పు మద్రాసు హిందూ దేవ, ధర్మాదాయాల నిర్వహణ చట్టాన్ని, మన ప్రభుత్వం సవరించ దలచుకుంది.

పట్టుపురుగుల తెగులు నిరోధానికి మేలురకం పట్టు పురుగుల పెంపకం, గుంటూరులోని వివాహాల రిజిస్ట్రారు పొరపాటున 1954 చట్టం క్రింద కాక 1872 వ సం॥పు ప్రత్యేక వివాహాల చట్టంక్రింద ఆమోదించిన కొన్ని వివాహాలను చట్టబద్ధం చేయుట, వగైరా విషయాలమీద కూడా శాసనాలు ప్రవేశపెట్టబడుతవి.

మన ప్రభుత్వ పరిశీలనలోగల యీ క్రింది శాసనచర్యలు అనతికాలంలోనే శాసనసభ ముందుకు రాబోతున్నవి:—

1. వివిధ జిల్లాలలోని భూమి శిస్తు స్థిరీకరణ, నీటి తీరువా పెంపకం, మరొక సంవత్సరంపాటు క్రమానుగతంగా పెరిగే భూమి శిస్తు సర్‌చార్జి విధింపు.

2. నాగార్జునసాగర నిర్మాణానికి అవసరమయ్యే భూముల ధరలలో స్పెక్యులేషన్ చర్యలు జరుగకుండా, ఆ భూముల ధరలను 1952 డిశంబరు 8 వ తేదీన, ప్రజలకు యీ ప్రాజెక్టు నిర్వహణ విషయం తెలియజేయబడిన నాటి ధరల స్థాయికి గానీ లేక యిప్పటి మార్కెటు రేట్లకుగానీ, యీ రెంటిలో యేది తక్కువైతే దాని స్థాయికితెచ్చి భూమి సేకరణ విలువను తగ్గించుట.

3. ఎయిడెడ్ పాఠశాలల మేనేజిమెంటును శాశ్వతంగా స్వాధీనం చేసుకొనుట, అందుకు సంబంధించిన యితర విషయాలు.

4. హామీల విలువలో 50% నుండి 75% వరకు అప్పుల పరిమితిని పెంచటానికై 1922 వ సం॥పు మద్రాసు పరిశ్రమల సహాయ చట్టాన్ని సవరించుట.

5. అభ్రకం నిల్వలు, అమ్మకం, రవాణా, ఎగుమతులమీద లైసెన్సులు, పర్మిట్లతోకూడిన ఒక విధానాన్ని రూపొందించి, తద్వారా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా జరిగే అభ్రకం దొంగరవాణాను అరికట్టుట.

6. ఆయుర్వేద, హోమియో వైద్యుల, ఫార్మసీలను రిజిష్టరు చేసే శాసనం.

7. అమ్మకం పన్నుల విచారణసంఘంవారి సూచనలలో ప్రధానమైన వాటిని అమలుపరచుటకు శాసనం

8. 1920 సం॥పు మద్రాసు జిల్లా మున్సిపాలిటీల చట్టం, 1950 సం॥పు మద్రాసు గ్రామ పంచాయతీల చట్టాలను సమగ్రంగా సవరించుటకు శాసనం.

9. 1956 వ సం॥పు ఆంధ్ర అత్యవసర వస్తువుల ఖాయిదా, సమీకరణ (తాత్కాలికాధికారాలు) చట్టాన్ని మరి రెండు సంవత్సరాల వరకు పొడిగించుట.

అనవసరమైన నిబంధనలు తొలగించి, వడ్డీ వ్యాపారాన్ని, వ్యక్తి వ్యాపారాన్ని క్రమబద్ధం చేసి, గిరిజనుల ఋణభారాన్ని తగ్గించే విషయాన్ని గురించి ప్రభుత్వం శ్రద్ధగా పరిశీలిస్తున్నది.

మన ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, నేను సూచించిన శాసన చర్యలు—అన్నీ, సమావేశంలో చర్చకు పెట్టబడుతవి.

మీ చర్చా వివరాలను నేను సావధానంగా పరిశీలిస్తుంటాను. మన గత విజయాలకూ, సంప్రదాయాలకూ, మన భవిష్యత్తు నిర్మాణపు ఆశలకూ ఆశయాలకూ అనుగుణంగా యీ చర్చలు సాగుతాయనటంలో నా కెట్టి సందేహంలేదు. ఈ సమావేశ కార్యక్రమ నిర్వహణలో మీ అందరికీ సంపూర్ణ విజయాన్ని ఆకాంక్షిస్తున్నాను.

— జై హింద్ —